నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
శనివారం
20 జులై 2024
పేజీలు 8
ప్రకాశం
బాపట్ల



శబరిమల సన్నిధానంలో వేంచేసి వున్న హరిహరసుత అయ్యప్పస్వామిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు, తన యుడు శిద్దా సుధీర్ కుమార్, ఎం.శివరామ్‌లు దర్శించుకు న్నారు. శుక్రవారం ఉదయం జరిగిన స్వామి వారి నెయ్యాభిషేకం, విశేష పుష్పాభిషేకంలో పాల్గొన్నారు. దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదానానికి రూ.4 లక్షలు విరాళంగా చెక్కు అందజేశారు.

5 లో...



బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కృష్ణా నది అరవింద వారధి, పెసర్లంక, చిలుమూరులంక, సుగ్గన లంక, పెద్దలంక, చింతర్లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వరద ప్రమాదానికి గురయ్యే గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తం కావాలని, అధికారులకు సహకరించాలని కోరారు.

8 లో...

# అబద్ధపు ప్రచారానికి బ్రాండ్ జగన్‌రెడ్డి



**వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య తెదేపాకు ఆపాదించడం సిగ్గుచేటు**

**ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించినా బుద్ధి మారలేదని ధ్వజం**

**వినుకొండలో హత్యకు ముఖ్య కారకుడు జగన్**

**మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి, అనగాని**

సూర్యప్రతినిధి, ఒంగోలు

అబద్ధపు ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి అని వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను తెలుగుదేశం పార్టీకి ఆపాదించడం సిగ్గుచేటు అని మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్‌లు దుయ్యబట్టారు. ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా జగన్ మాత్రం తన బుద్ధి మార్చుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. సొంత బాబాయిని చంపి నారాసుర రక్తచరిత్ర అంటూ టిడిపిపై తప్పుడు ప్రచారం చేసిన నీచ చరిత్ర జగన్‌ది అని గుర్తుచేశారు. వినుకొండలో జరిగిన హత్యకు ముఖ్య కారకుడు జగనే అని, వైసీపీ హయాంలో హతుడు రషీద్ నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై నాడే చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ హత్య జరిగేదా అని ప్రశ్నించారు. నాడు జగన్ చేసిన పాపానికి మూల్యం ఒక వ్యక్తి నిండు ప్రాణమని, వైసీపీ హయాంలో జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు ప్రతిపక్ష నేతలను బయట తిరగకుండా అడ్డుకున్న పిరికిపంద జగన్, రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేతలు పరామర్శించకుండా పోలీసులు అడ్డుపెట్టుకొని జగన్ నియంతగా వ్యవహరించిన విషయాన్ని తెలియజేశారు. కానీ నేడు టిడిపి పాలనలో జగన్ స్వేచ్ఛగా తన పర్యటనలు చేసుకుంటున్నారని, టీడీపీ, వైసీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని లేదంటే ప్రజలే జగన్‌ని శాశ్వతంగా రాజకీయాలు మానిపిస్తారని ధ్వజమెత్తారు.

### జగన్ నీ ఆటలు సాగవు

వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను ప్రభుత్వంపై రుద్దడం జగన్‌రెడ్డి నీచ రాజకీయాలకు నిదర్శనమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. వివాదాన్ని మరింతగా రెచ్చగొట్టేందుకు జగన్‌రెడ్డి వినుకొండలో పర్యటించారని ఎద్దేవా చేశారు. హత్యా రాజకీయాలకు పేటెంట్ పొందిన ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ అని విమర్శించారు. నిందితులు ఎవరైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. చంద్రబాబు వద్ద జగన్ ఆటలు సాగవని తెలుసుకోవాలని హితవు పలికారు.



# రామతీర్థం జలాశయం సందర్శించిన కలెక్టర్

నాణ్యమైన విద్యాబోధన ఉండాలి

పౌష్టికాహార భోజనం అందించాలి

గురుకులం అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః జిల్లా కలెక్టరు తీమీమ్ అన్సారియా చీమకుర్తి మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత రామతీర్థం బ్యాలిన్సెంగ్ రిజర్వాయరును సందర్శించారు. ఇన్ టెక్ వెల్ మరియు పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నుండి వాటర్ డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు వెంట ఆర్‌డబ్ల్యూస్ ఎస్.ఇ..మురలీకృష్ణ, మర్ధన్ ఆలీ, ఇరిగేషన్ ఎస్ఈ మురళీ కృష్ణ,ప్రాజెక్టు ఎస్.ఇ.అబుత్‌ఆలీం,





ఇంజరీంగ్ అదికారులు పాల్గొన్నారు. అనంతరం చీమకుర్తి పట్టణంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంను కలెక్టరు ఆకస్మికంగా

మిగతా 3లో

## విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకో..





మీడియా, ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ప్రకాశం భవనం వద్ద ఏపిడబ్ల్యూజేఎఫ్, ఏపిజేఎఫ్, ఏపిఈజేయు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా

5 లో...

## పెండింగ్ ఫిర్యాదుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ



వివరాలు 8లో

## ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న



బాపట్ల మేజర్‌న్యూస్: బాపట్ల మండలం మర్రిపూడి గ్రామం కుమ్మరి కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఓటికుండల విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఒంగోలు మామిడిపాలెం విద్యుత్ కాలనీ లో నివాసముంటున్న బీసీ సంక్షేమ ఎంప్లాయ్ రవితేజ 2019 నుండి బ్రెయిన్ ట్రూమర్ వ్యాధితో అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులతో ఉన్నట్లు సామాజిక మధ్యమంలో చూసి స్పందించి వారి తండ్రి ఓటికుండల శ్రీనివాసరెడ్డి (చీరాల డిపో ఆర్టీసీ డ్రైవర్) వారి బాబాయ్ ఓటికుండల లక్ష్మణ రావు (ఎజిబి టెక్ కాలేజ్ బాపట్ల) కేకేఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, కుమ్మరి అంజిరెడ్డి, వేజండ్ల శ్రీనివాసరావు, ఒంగోలు ఎస్పీ ఆఫీస్ కోటేశ్వరరావు, ఒంగోలు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్స్ పి.బ్రహ్మయ్య, ఆర్టీసీ ఎంప్లాయ్ శివ కలిసి ఒంగోలులోని వారి నివాసమునకు వెళ్లి లక్ష రూపాయలు ఆర్థిక సాయం రవితేజకు అందించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ప్రస్తుతం రవితేజకు చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని. ఇదేవిధంగా మరి కొంతమంది స్వచ్ఛంద సేవా సంస్థలు వారు మానవత్వం తో ఆలోచించి వారి కుటుంబాన్ని మీ వంతు సాయం చేయాలని కేకేఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారు కోరారు. రవితేజ 2019 నుంచి ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడటం వల్ల ప్రభుత్వం నుండి స్నేహితుల నుండి ఆర్థిక సహాయం కొంత అందినది.రవితేజ కి చికిత్స చేప్పించే ఆర్థిక స్తోమత మా వద్ద లేదని దయచేసి సహృదయం కలిగిన దాతలు ఎవరైనా సాయం చేయదలచిన వారు ఈ నెంబర్ కి 9494098857 ఫోన్ చేసి మాట్లాడి సహాయం చేయాలని రవితేజ కుటుంబ సభ్యులు కోరారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి ఎన్ దేవరాజ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ చావలి సునీల్ ఆదేశాల మేర భట్టిప్రోలు మండలంలోని రైతులందరికీ సమాచార హక్కు చట్టం 2005పై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం అద్దేపల్లి రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి మీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో ఎంఈఓ తో పాటు మరో ఇద్దరి రిసోర్స్ పర్సన్స్ కిషోర్,కే సురేష్ లు పాల్గొని సమాచార హక్కు చట్టంపై ప్రజలకు వివరించారు.సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ ల గురించి,వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేశారు.ఈ చట్టం అనేది రాజస్థాన్ లోని రైతుల పోరాటంతో వచ్చిందని వారు వివరించారు.ఈ విధంగా రైతుల నుండి వచ్చిన చట్టం వ్యవసాయ శాఖ వారు రైతులకు అవగాహన కల్పించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బొర్రా రంజిత,ఐసిడిఎస్ సూపర్వైజర్ జేవి రమణమ్మ,రైతు సహాయకులతో పాటు,రైతులు డొక్కు శ్రీనివాసరావు,యడ్ల జయశీలరావు, కంభం సుధీర్,వాకా పాపారావు,డొక్కు ముత్యాలు, కార్మూరు నాగరాజు, సువ్వా బాబూరావు,లింగం ప్రసాదు పలువురు రైతులు పాల్గొన్నారు.

## శివప్రసాద్‌కు నివాళులర్పించిన మున్సిపల్ కమిషనర్



బాపట్ల మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘం కార్యాలయంలో డిపిఓగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా మరణించిన జంపని శివప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్. వారి కుటుంబానికి సంతాపం తెలియజేసి ధైర్యం చెప్పి పురపాలక సంఘం కార్యాలయం సిబ్బంది సహకారంతో రూ.25,000 అందజేశారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్



బాపట్ల మేజర్‌న్యూస్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై చర్చ జరిగింది. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఏదైనా ఘటన జరగగానే ప్రాథమిక విచారణ చేయాలన్నారు. నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జ్ షీట్ వేయాలన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. వైద్య ధ్రువీకరణ పత్రాల జారీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 47 కేసులకు నష్టపరిహారం అందించడానికి దస్త్రాలు సిద్ధం చేశామన్నారు. నిధులు విడుదల కాగానే నేరుగా బాధితులకు చేరుతాయన్నారు. అధిక నిధులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. భూమి కేటాయింపులు, ఉద్యోగం నియామకాలపై చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులను సత్వరమే ఎలా పరిష్కరించాలో అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ గ్రామాలను గుర్తించాలన్నారు. ఏ గ్రామాలలో ఎంత భూమి అవసరత ఉందో, ఎంత భూమి కావాలనే అంశాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన స్మశానభూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమలులో అడ్డంకులను తొలగించేలా చూస్తామన్నారు. అద్దంకి గోవాడలో తక్షణమే స్మశాన భూమి కేటాయించాలన్నారు. మాదకద్రవ్యాలు నిరోధించడానికి పోలీసు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాధితులకు భరోసా కల్పించే తక్షణమే సహాయ సహకారాలు అందించేలా చూస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. ఘటనలు జరిగిన ప్రాంతాలకు తక్షణమే పోలీసులు వెళ్లి విచారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చార్జిషీటు తక్షణమే నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తామని చెప్పారు. ప్రజలలో సామాజిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ కేసులలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు అన్నారు. కేసులలో ఎదురయ్యే సమస్యలన్నీ పరిష్కరిస్తామని వివరించారు. ఈ సమావేశంలో చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ రాజాదిబోరా, కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి.ప్రసాద్ రావు, టి సురేష్, జి.రాజారావు, జి.నాగమణి, అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఆర్ డి ఓ లు, డిఎస్పీలు,తదితరులు పాల్గొన్నారు.

# పోస్టాఫీసు ఉద్యోగి చేతివాటం రూ.50లక్షలు

**లబోదిబోమంటున్న ఖాతాదారులు**

**కొందరికి కొంత డబ్బే చెల్లింపుచేసి చేతులెత్తేసిన అధికారులు**

**మొత్తం చెల్లించాల్సిందేనంటూ నిరసన**



నగరం, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని సిరిపూడి పోస్టాఫీసులో డబ్బులు జమచేసి మోసపోయిన ఖాతాదారులకు తిరిగి చెల్లించి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు గైకొనాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిపూడి పోస్టాఫీసు వద్ద మోసపోయిన బాధితులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. అవినీతిపై ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాలుగా ఇదే పోస్టాఫీసులో ఉద్యోగి సుమారు 700 ఖాతాదారులు ప్రారంభించి సుమారు 50లక్షల రూపాయిల వరకు డిపాజిట్లు, నెలవారీ పొదుపు చెల్లిస్తున్నప్పటికీ సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తన స్వంతానికి వాడుకున్నాడని ఆరోపించారు. ఈ విషయం బయటికి రాగానే అధికారులు ఆ ఉద్యోగిచేత కొందరికి డబ్బులు చెల్లింపుచేయించి, మిగిలినవారికి చెల్లించకుండా చేతులు దులుపుకున్నారన్నారు. బాధితులందరికీ సరైన న్యాయం జరిగే వరకు తాము కమిటీగా ఏర్పడి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మణిలాల్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రమేష్, మోసపోయిన పోస్టల్ ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



## తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు

నగరం, మేజర్‌న్యూస్: బహిరంగ మార్కెట్ రేట్లకంటే తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అమ్మకం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నగరంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు రేపల్లె తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను శివప్రసాద్ ప్రారంభించారు. ఈ కౌంటర్లో ఫైన్ రకం స్టీమ్ బియ్యం కిలో రూ.49లకు, ఫైన్ రకం ముడిబియ్యం కిలో రూ.48లకు, దేశవాళీ కందిపప్పు కిలో రూ.160లుగా నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల తహశీల్దారు ఏ. శ్రీశిల్ప, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, కాసాని శ్రీనివాసరావు, లుక్కా గుడారంకయ్య పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



బాపట్ల మేజర్ న్యూస్: బాపట్ల కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని నూతన ఎస్పీ (సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) తుషార్ డుడి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.



## మండలం నుంచి ఎన్ఎంఎంఎస్ సీట్లకు ఐదుగురు ఎంపిక



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: భట్టిప్రోలు మండల పరిధిలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి 2024-25 విద్యా సంవత్సరా నికి గాను ఐదుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ సీట్లకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికా రులు పులి లాజరు,ఎన్ దేవరాజ్ లు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పెసర్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి మోర్ల తేజశ్రీ,పమిడి పాముల గౌతం, ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి దామెర్ల సుబ్రహ్మణ్యేశ్వర శ్రీనివాస్,అందే సాయి సూర్య,మాచర్ల గాయత్రి లు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.గత సంవత్సరం ఎన్.ఎం.ఎం.ఎస్ సీట్లకు గాను భట్టిప్రోలు మండలం నుండి ఒక్కరు మాత్రమే ఎంపిక కాగా ఈ విద్యా సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంఈఓ లు అభినందించారు.

# ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూను నివారించవచ్చు




రేపల్లే మేజర్‌న్యూస్: గ్రామీణ ప్రాంతాలలో ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చని మోళ్ళగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ సాయి అన్నారు. శుక్రవారం మండలంలోని మోళ్ళగుంట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సంధ్బంగా డాక్టర్ సాయి మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారించగలమని, ప్రజలందరూ తప్పనిసరిగా ఇంటి పరిసరాలలోని వ్యర్థాలను, కృత్రిమ నీటి నిల్వలను తొలగించి దోమలు అభివృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం మొదలైంది, వర్షపు నీరు నిల్వలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల వృద్ధిని అరికట్టాలని, వాటిపై యుద్ధం ప్రకటించాలన్నారు. వ్యర్థనీటి నిల్వలను మట్టితో పూడ్చాలనీ, మురుగు నీటి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచి నీటి నిల్వలను వారానికి ఒకసారి తొలగించి ఎండబెట్టి ఫ్రైడేడ్రై డే పాటించాలన్నారు. దోమలు పెరగకుండా పరిసరాల్ని శుభ్రపరచి, దోమ లార్వా నివారణ మందులను పిచికారి చేయాలనీ, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. దోమలు కుట్టకుండా ప్రజలందరూ తప్పనిసరిగా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా ఉండాలని, ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెష్‌లు కట్టుకోవాలని, ఇంటి పరిసరాలలో వృధాగా పడవేసిన టైర్లు, కొబ్బరి బొండాలు, పగిలిన కుండలు, వాడని కూలర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాడని రోళ్లు, తొలగించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ముఖ్యంగా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులను ముందుగా గుర్తించాలని ఆరోగ్య సిబ్బందినీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్య సూపర్వైజర్లు వైవి.రావు రంగారావు ప్రేమ కుమారి ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆషా సేవలు అభినందనీయం

**బదిలీపై వెళుతున్న ఆషాకు ఘనసన్మానం**




కొత్తపట్నం, మేజర్‌న్యూస్: కొత్తపట్నం బస్సు వైద్య అధికారి ఉప్పుటూరి ఆశ రైతులకు గ్రామస్తులకు చేసిన వైద్యసేవలు సంతృప్తినిచ్చాయని గ్రామస్తులు కొనియాడటం ఎంతో అభినందనీయమని ఏవిహెచ్ ఎన్జీపాడు ఏడి నాగభూషణం అన్నారు. శుక్రవారం పశువైద్య కేంద్ర ఆవరణలో ఉప్పుటూరి ఆషా ఆత్మీయ బదిలీ అభినందన సభ కు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఏవిహెచ్ త్రావగుంట ఏడి బసవ శంకర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఏడి నాగభూషణం మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ విధులు నిర్వహిస్తూ ఎలాంటి గ్రీవెన్స్ అర్జీలు కూడా లేకుండా రైతులు గ్రామస్తులలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నదని అన్నారు. గతంలో పశు వైద్యాధికారి హాస్పిటల్‌కి మాత్రమే పరిమితం అయ్యే వారని, నేడు నిత్యం రైతులు గ్రామస్తులలో మమేకమై విధులు నిర్వహించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం ఇన్చార్జిపశు వైద్యాధికారి తుపాకుల అనూష, అల్లూరు వైద్యాధికారి శోభ, టంగుటూరు ఉల్చి, ఎం. నిడమానూరు, ఉప్పుగుండూరు, నిప్పట్లపాడు, కొణి జేడు ఎర్రజర్ల ఫస్ట్ వైద్యాధికారులు విజయ మాధవి ప్రతిమ ధనలక్ష్మి జాస్మిన్ ప్రశాంతి అనిల్, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం




పిట్టలవానిపాలెంమేజర్ న్యూస్:మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శ్రీచావలి సునీల్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గారి ఆదేశాల అనుసారం సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, అధికారులకు మరియు అనధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమం గురించి సహాయ వ్యవసాయ సంచాలకులు బాపట్ల ఏ లక్ష్మి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఇది ఏ విధంగా ఉపయోగం పడుతుందో వివరించారు. ఈ సమాచార హక్కు చట్టం 2005 గురించి క్లుప్తంగా చెప్పడానికి బాపట్ల జిల్లా డిసిఐసి డిపార్ట్మెంట్ ఇమాన్యుల్ ఏ విధంగా ఈ సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుంది ఎన్ని రోజుల్లో దేనికి ఏ విధమైన రిప్లై ఇస్తారు అర్జీలను ఏ విధంగా పరిష్కరించాలి అనే దానిపై వివరంగా చెప్పడం జరిగింది. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అయిన డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి నారుమల్లు ఎదబెట్టిన పంట గురించి వివరంగా చెప్పడం జరిగింది. డాక్టర్ ఉష మాట్లాడుతూ వరిలో కలుపు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సత్య నందు, గ్రామ సర్పంచులు, పంచాయతి సెక్రటరీలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

నగరం, మేజర్ న్యూస్ : సమాచార హక్కు చట్టంపై నేడు అనగా శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి వి. రమేష్‌బాబు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి సూచనల మేరకు ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, రైతులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి:ఎస్ఐ



కొనకనమిట్ల, మేజర్ న్యూస్ : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించాలని ఎస్సై కే మాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొనకనమిట్లలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ద్విచక్ర వాహందారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు వేసుకోవాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ మాధవరావు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎంతటి వారైనా జైలు తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రామతీర్థం జలాశయం సందర్శించిన కలెక్టర్



**మొదటి పేజీ తరువాయి** తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో ఉన్న విద్యార్థినుల అడ్మిషన్ వివరాలను, హాజరు రిజిష్టర్స్, వంట సరుకుల నాణ్యత, భోజనం నాణ్యతను కిచెన్‌లో పరిశుభ్రతను కలెక్టరు



స్వయంగా పరిశీలించారు. వండిన ఆహారం పరిమాణంలను ప్రిన్సిపాల్‌ను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఆహారం వండే విదానం, మెనూ ప్రకారం పిల్లలకు అందిస్తున్నారా లేదా అని కూడా కలెక్టరు స్వయంగా పరిశీలించారు. విద్యార్థినిలకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తెలియజేయాలని కలెక్టరు ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం డార్మెంటరీను, డైనింగ్ హాల్‌ను, హ్యాండ్ వాష్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, రాతపుస్తకాలు, కిట్లు తదితరమైనవి అందాయా లేదా అని విద్యార్థినిలను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా భోదన ఉండాలన్నారు. గురుకులంలో విద్యాభ్యాసం చేసి విద్యార్థినిలల్లో పౌష్టికాహార లోపం లేకుండా ఉండేలా ప్రభుత్వం నిర్ధేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టరు ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కలెక్టరు వెంట చీమకుర్తి తహశీల్‌దారు సురేష్, మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు తదితరులు ఉన్నారు.

# నిజాంపట్నం హార్బర్ సందర్శించిన శివప్రసాద్



నిజాంపట్నం, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన నిజాంపట్నం హార్బర్ (మొగ) ప్రాంతాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, నాయుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసిన గొల్లపూడి



తాళ్లూరు, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొల్లపూడి వేణు బాబు తెలుపుతూ దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బాగా అభివృద్ధి చేశారు. పార్టీ కార్యకర్తల కృషికి అభినందించడం జరిగిందని ఆయన తెలిపారు.

## తెలుగుదేశం గూటికి కర్లపాలెం సర్పంచ్

### ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో పార్టీలో చేరిన 36 కుటుంబాలు

కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు నియోజకవర్గంలో మొదటినుంచి వైసీపీకి పూర్తిగా కంచుకోట అయిన గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ కర్లపాలెం గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. వైసిపి మద్దతుతో సర్పంచ్ గా ఎన్నికైన చాపల రమణయ్య సహా 36 కుటుంబాల వారు, ఈరోజు కందుకూరులోని టిడిపి కార్యాలయంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. సర్పంచ్ చాపల రమణయ్యతో పాటు గ్రామపెద్ద చాపల మీరయ్య, లంకె సుబ్బారావు, చాపల శ్రీనివాసులు, పిన్ని వెంకటశేషయ్య, ఐలా వరప్రసాద్, వల్లభుని వెంకటశేషయ్య, పిన్ని శ్రీనివాసులు, చాపల వెంకటేశ్వర్లు, చాపల నరసింహం, ఇంకా పలు కుటుంబాలవారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విధానాలు నచ్చి టిడిపిలో చేరుతున్నామని ఆయన ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం ఏర్పడిందని సర్పంచ్ రమణయ్య తెలిపారు. గ్రామస్తుల్లో మార్పు రావడం సంతోషంగా ఉందని, కర్లపాలెం గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

## అన్నదానానికి కెసిపి సిమెంట్ అధినేత విరాళం



పామూరు, మేజర్‌న్యూస్: ఈనెల 21న గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని సాయి బాబా స్వామి దేవస్థానం వద్ద జరుగు అన్నదాన కార్యక్రమానికి కెసిపి సిమెంట్ అధినేత వి.ఎల్ ఇందిర దత్తు రూ. 150000లు విరాళం అందజేసినట్లు సాయిబాబా దేవస్థానం కమిటీ చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు.



## విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై జర్నలిస్టుల నిరసన

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని జర్నలిస్టుల ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ర్యాలీ నిర్వహించడంతోపాటు గిద్దలూరు ఎమ్మార్వోకు గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్యకు విజయసాయిరెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ జర్నలిస్టులు విన్నతి పత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టుల గౌరవానికి భంగం కల్పిస్తూ విజయసాయిరెడ్డి వ్యవహరించారని స్థానిక జర్నలిస్టులు విజయసాయి రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## విద్యాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయం

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: పాఠశాలలో విద్యాభివృద్ధికి దాతల చేయూత గ్రామస్థుల సహకారం అభినందనీయమని ఉపాధ్యా యులు అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిగారికొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన చల్లా పెదమాల్యాద్రి కుమారులు మనోజ్, మధు పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్థికంగా స్థిరపడిన గ్రామస్థులు ప్రతిఒక్కరు పాఠశాల విద్యాభివృద్ధికి అదేవిధంగా సమాజాభివృద్ధికి చేయూతనివ్వాలని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించి గ్రామానికి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.రామకృష్ణ,దాతలు చల్లా పెదమాల్యాద్రి కుమారులు మనోజ్, మధు, ఉపాధ్యాయులు హరిబాబు, ఐశ్వర్య, హెబ్సిబా, గ్రామస్థులు చెంగలయ్య, శ్రీను, గోవిందమ్మ, సుబ్బారావు, నాలి రామ్మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.




## క్విస్‌లో స్త్రీ జనేంద్రియ సమస్యలపై అవగాహన

ఒంగోలు, మేజర్‌న్యూస్: స్థానిక వెంగముక్కపాలెం నందు గల క్విస్ ఫార్మసీ కళాశాల ఏన్ఎస్ఎస్ యూనిట్ వారి ఆధ్వర్యంలో స్త్రీ జనేంద్రియ సమస్యలపై అవగాహన అనే అంశంపై ప్రముఖ కిమ్స్ హాస్పిటల్ గైనకాలజీ వైద్యనిపుణులు డాక్టర్ గుంజుపల్లి కల్పనా అవగాహన కల్పించారని కళాశాల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డా.శ్రీగాయత్రి, కళాశాల ప్రిన్సిపాల్ డా ఏం.కిషోర్ బాబు తెలియజేశారు. డా.జి.కల్పనా మాట్లాడుతూ స్త్రీ జననేంద్రియ వ్యవస్థలోని యోని, గర్భాశయం, అండకోశాలు మొదలైన భాగాలకు సంబంధించిన రుగ్మతలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యలు, రుతక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా ఏన్ఎస్ఎస్ వాలంటీర్‌కు, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, బీ ఫార్మసీ విద్యార్థినిలకు తెలియజేశారు. గైనకాలజిస్టులు చేపట్టే కొన్ని ముఖ్యమైన వ్యాధులు జననేంద్రియాలకు చెందిన క్యాన్సర్, క్యాన్సర్ ముందు పరిస్థితులు. స్త్రీల మూత్ర వ్యవస్థకు సంబంధించిన సమస్యలు, ఋతుచక్రం ఆగిపోయిన స్థితి, ఋతుస్రావంలో నొప్పి, సంతానలేమి, అధిక ఋతుస్రావం, గర్భసంచి జారడం, జననేంద్రియాలకు చెందిన వివిధ భాగాలలో రకరకాలైన ఇన్‌ఫెక్షన్ వలన కలిగే సమస్యలు గురించి వివరించారు. రుతుక్రమం సమయంలో ప్రతి స్త్రీ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, కిమ్స్ మేనేజర్ అమర్నాథ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏన్ఎస్ఎస్ కోర్డినేటర్ ధనమూర్తి పర్యవేక్షించారు.



## బిజెపి మండల కార్యవర్గ సమావేశం

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: బిజెపి మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం మండల బిజెపి అధ్యక్షుడు ఇండ్లవెంకటసత్యం అధ్యక్షతన సిఎస్ పురంలో జరిగినది. ఈ సమావేశంలో కనిగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడవసారి అధికారం అదేవిధంగా రాష్ట్రంలో టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించడంలో బిజెపి నాయకులు, కార్యకర్తల కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రాష్ట్రబిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నాయకత్వంలో బిజెపి మరింత అభివృద్ధి చెందినట్లు కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అదేవిధంగా రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తీసుకుంటున్న ప్రజాసంక్షేమ పథకాలు అదేవిధంగా ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు గురించి మండలంలో గ్రామాల్లో ప్రజలకు వివరించాలని బిజెపి క్షేత్రస్థాయిలో విస్తృతపరచాలని కార్యవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో కొండిశెట్టి వెంకట రమణయ్య, ఇండ్ల వెంకటసత్యం, అనిల్, చెన్నయ్య, యం.మాల్యాద్రి, రాయుడు, వి.శ్రీను, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.



## వల్లూరు చెరువులో పడి ఇద్దరు మృతి

### మృతులలో ఒకరి వెలికితీత, మరొకరి కొరకు గాలింపు



టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వాసేపల్లిపాడు గ్రామాని కి చెందిన నలమాలపు నవీన్, శ్యాం బాబు వల్లూరు చెరువులో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం వాసేపల్లి పాడు గ్రామానికి చెందిన నలమాలపు నవీన్ (23), శ్యాంబాబు (20), అనే ఇద్దరు యువకులు గురువారం మధ్యాహ్నం ఇంటి నుండి బయలుదేరి శుక్రవారం వరకు ఇంటికి రాకపోవడంతో ఇరువురు కుటుంబాలు చెందిన సంబంధిత బంధువులు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటికి రాకుండా పోయిన ఇద్దరు యువకులలో ఒకరి సెల్ ఫోను కు ఫోన్ చేయగా వల్లూరు చెరువు ప్రాంతంలో ఉన్నట్లు సెల్ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న సింగరాయకొండ సిఐ రంగనాథ్, స్థానిక ఎస్సై పున్నారావు ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో దిగి గాలించగా నలమాలపు నవీన్ శవాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు గాలించినప్పటికీ శ్యాంబాబు దొరకకపోవడంతో రాత్రివేళ రిస్క్ ఆపరేషన్ నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం గజ ఈతగాళ్లతో వల్లూరు చెరువులో శ్యాంబాబు శవం కోసం గాలించునున్నట్లు తెలిపారు. శ్యాంబాబు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కొరకు నవీన్ శవాన్ని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని వై.చెర్లపల్లి జడ్పిటిసి హై స్కూల్ నందు విద్యార్థులతో మలేరియా, డెంగ్యూ గురించి సబ్ యూనిట్ అధికారి రమేష్ బాబు, రాఘవేంద్ర రావు, హెల్త్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , జ్వరాల పట్ల జాగ్రత్త వహించాలని, డయేరియా కూడా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని వర్షాకాలంలో చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువ. ప్రజలు సురక్షితంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం ఎక్కువ రోజులపాటు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని వారు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కందుల ఇజ్రాయిల్, ఏ.ఎన్.ఎం ఎస్కే బేగం, ఆశా వర్కర్స్ లక్ష్మీదేవి, హైస్కూల్, ఎంపీపీ స్కూల్ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకో....





**మీడియా యాజమాన్యాలు, ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు**

**మీడియా రంగానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలి**

**విజయసాయిరెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**ప్రకాశం భవనం వద్ద ఏపిడబ్ల్యుజేఎఫ్, ఏపిజేఎఫ్, ఏపిఈజేయులు ధర్నా**

**నిరసన ర్యాలీ, ప్రజా సంఘాలు సంఘీభావం, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం**

ఒంగోలు, మేజర్‌న్యూస్ :

మీడియా యాజమాన్యాలపై విలేకర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు జర్నలిస్టు యూనియన్ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏపిడబ్ల్యుజేఎఫ్, ఏపిజేఎఫ్, ఏపిఈజేయు ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సంఘీభావం తెలియజేశాయి. ధర్నా అనంతరం నిరసన ర్యాలీ చేపట్టి జిల్లా కలెక్టర్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపిడబ్ల్యుజేఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు, వారధి ఎండి అజయ్‌లు మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా వ్రాసే, చూపించే మీడియా రంగాన్ని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యులు, వైసిపి నేత విజయ సాయిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి డిమాండ్ చేశారు. రెండో సారి ఏ రాజకీయ నాయకుడు మీడియా రంగంపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా విజయసాయిరెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పత్రికా స్వేచ్ఛను హరించివేసేలా ఎవ్వరూ మాట్లాడినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మీడియాతో మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఏపిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు దిలీఫ్ మాట్లాడుతూ మీడియా యాజమాన్యాలు, ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయ సాయిరెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపిఈజేయు రాష్ట్ర నాయకులు మేకపాటి మాల్యాద్రి మాట్లాడుతూ మీడియా రంగంపై ఎవ్వరు అనుచిత వ్యాఖ్యలు చేసినా వారికి బుద్ధి వచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీల ప్రతినిధులైనా మీడియాను గౌరవించాల్సిన అసవరం ఎంతైనా ఉందన్నారు. మీడియా లేకుండా రాజకీయ పార్టీలకు మనుగడే లేదన్నారు. విజయసాయిరెడ్డి మీడియా మిత్రులపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులను చులకన భావంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయ సాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టివి5 స్టాఫ్ రిపోర్టర్ జనార్ధన్, పి9 ఎండి కిరణ్, ఆర్‌టివీ స్టాఫ్ రిపోర్టర్ శ్రీను, ఐన్యూస్ సుధాకర్, సూర్య స్టాఫ్ రిపోర్టర్ ఎం. శ్రీధర్, ఎంసిఏ భవన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, హెన్స్‌ఇండియా ఫోటోగ్రాఫర్ అజయ్, సూర్య రిపోర్టర్లు కోటయ్య, సురేష్, రమణ, కోటేశ్వరరావు, వార్త సునీల్, బాబి, ప్రజాశక్తి నరసింహారావు, వసంత్ కుమార్, ఏపిఈజేయు నాయకులు పల్లపు శేషుకుమార్, శ్రీసత్య శరత్, జెజ్జర ఏడుకొండలు, అశోక్, బొడ్డు శ్రీనివాసులు, కాలేషావలి, ఎస్‌కె హనుమాన్ భాషా, పి. కొండలు, కళాంజలి సుబ్బారావు, బి. శ్రీనివాసులు, పి. ప్రతాప్, ఈదర రాఘవ, కె. శివ, సుబ్బారావు, అశోక్, శ్రీనివాసచారి, వెస్పా, ఎస్‌కె భాష, అంగలకుర్తి ప్రసాద్,



## శబరిమల అయ్యప్పను దర్శించుకున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

ఒంగోలు, మేజర్‌న్యూస్: కేరళ రాష్ట్రంలో వెలసి ఉన్న కలియుగ ప్రత్యక్ష దైవం శబరిమల అయ్యప్ప స్వామిలి దేవస్థానంలో నెయ్యి అభిషేకం కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి, యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



## నిత్య అన్నదానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రూ.4లక్షల విరాళం

ఒంగోలు, మేజర్‌న్యూస్: కేరళ రాష్ట్రంలో వెలసి ఉన్న కలియుగ ప్రత్యక్ష దైవం శబరిమల అయ్యప్ప స్వామి దేవస్థానంలో పుష్పాభిషేకం కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి, యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్ పాల్గొన్నారు. తదనంతరం నిత్య అన్నదానం కొరకు 4లక్షల రూపాయలను ఆలయ ఇఓకి శిద్దా రాఘవరావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది.

## వాసవి మాతకు సారే సమర్పణ



తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో ఆర్యవైశ్య బజార్లో ఉన్న వాసవి మాత దేవాలయంలో గ్రామ ప్రజలు ఆర్యవైశ్య మహిళలు పూజలు చేశారు. ఆషాడ మాస శుక్రవారం సందర్భంగా ఆలయ పూజారి బెల్లంకొండ శ్రీనివాస్ అమ్మవారిని పట్టుచీరలు అభరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి మహిళలు సారే సమర్పించారు. అలాగే ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ గుంటి గంగమ్మ తల్లికి సారే పెట్టడం అలాగే విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి కూడా గంగవరం నుంచి సారే తీసుకువెళ్లి పెట్టడం జరుగుతుందని ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే ఇంటూరి







లింగసముద్రం, మేజర్‌న్యూస్: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఎస్టీ (యానాదులు) సమస్యల పరిష్కారంపై ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. లింగసముద్రం మండలం పెదపవని(ఎస్టీ కాలనీ)లో శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయించి దానిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ఇంటింటి ప్రచార సందర్భంలో తమలో చాలామందికి ఆధార్ కార్డులు లేవని, దానివల్ల ప్రభుత్వ పథకాలు అందడంలేదని పలువురు ఎస్టీలు నాగేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వారి ఇబ్బందులపై సబ్ కలెక్టర్‌తో చర్చించి పెదపవనిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీలతో పాటు లింగసముద్రం మండలంలోని పలు గ్రామాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేని వారి నుంచి అర్జీలు స్వీకరించి, వారికి త్వరలో ఆధార్ సౌకర్యం కల్పిస్తామని అధికారులు తెలియజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా, చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పేదప్రజల కోసం మహాకూటమి ప్రభుత్వం నిరంతరం ఆలోచిస్తుం దని చెప్పారు. ఇలాంటి సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో అనేకమందికి ఆధార్ కార్డులు, ఇతర సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో కట్టా శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గొర్రెపాటి సాంబయ్య, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, పలువురు నాయకులు హాజరయ్యారు.

## రైల్లో దొంగతనాలు చేసే వ్యక్తి అరెస్టు



చీరాల రూరల్, మేజర్ న్యూస్: రైల్లో ప్రయాణించే వ్యక్తుల వద్ద బ్యాగ్‌లు దొంగతనం చేసే వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్సై సిహెచ్ కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిహెచ్ కొండయ్య ప్రకటనలో పేర్కొన్న వివరాల మేరకు తనిఖీలతో భాగంగా చీరాల రైల్వే స్టేషన్‌లో సోదాలు నిర్వహిస్తుండగా అనుమాన స్పదంగా సంచరిస్తున్న పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ గుడ్డిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. వాడరేవు గ్రామం వైయస్సార్ కాలనీకి చెందిన పెదాల వెకంటేశ్వర్లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలీ చేసుకున్న డబ్బులు విలాసాలకు సరిపోక పోవడంతో సులభంగా డబ్బులు సంపాధించాలని దొంగ తనాలకు పాల్పడుతున్నాడు. గుంతకల్ రైల్వే జిల్లా సూపరిటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ కె చౌడేశ్వరి ఆదేశాల మేరకు నెల్లూరు డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ సిహెచ్ విజయభాస్కర్ సూచనల మేరకు ఒంగోలు జిఆర్‌పి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె భుజంగరావు ఆధ్వర్యంలో చీరాల జీఆర్పీ ఎస్సై సిహెచ్ కొండయ్య ఇతర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెదాల వెంకటేశ్వర్లు అనే నిందితుడిని ఫ్లాట్ ఫారం నంబర్ 4 ఉత్తరం వైపు చివరన అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన పెదాల వెంకటేశ్వర్లు నుంచి రూ.3.81లక్షల విలువ కల్గిన 62 గ్రాముల బంగారం, 5 సెల్‌ఫోన్స్, 4 లాప్‌టాప్‌లు, 1 ఆపిల్ పాడ్ ఫోన్, వివిధ కంపెనీలకు చెందిన 3 వాచ్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి రైల్లో దొంగతనాలు చేసే వ్యక్తిను అరెస్టు చేసిన ఎస్సై కొండయ్యను, పిహెచ్‌సి కె భాస్కర్‌ను, పీసీలు గోపిని, లక్ష్మీనారాయణను, శ్రీను రాజును, బ్రహ్మయ్యను నెల్లూరు డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ సిహెచ్ విజయ భాస్కర్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ కె భుజంగ రావు, ఎస్సై సిహెచ్ కొండయ్య, ఎస్సై జి మాలకొండయ్య, ఏఎస్సై కె రమేష్, ఏఎస్సై ఎ సురేష్, చీరాల జీఆర్‌పి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు కసరత్తు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్‌ని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్నా క్యాంటీన్ భవనానికి మరమ్మత్తులు చేయడంతో పాటు ఆగస్టు 15కి భవనాన్ని సిద్ధం చేయనున్నారు.

# ఉజ్వాల భవిషత్తుకు యలమంచిలి విద్యా సంస్థలు



చీరాల, మేజర్ న్యూస్: యలమంచిలి విద్యా సంస్థలు విద్యార్థుల ఉజ్వల భవిషత్తుకు ఎంతోగానో దోహదపడతాయని ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ గుర్తు చేశారు. స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో శుక్ర వారం ప్రిన్సిపాల్ పి రవికుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి రవికుమార్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా కాకుండా సేవా భావంతో పేద విద్యార్థులకు ఫీజులలో అధిక రాయితీలిచ్చి విద్యనందిస్తున్న విద్యా సంస్థ యలమంచిలి విద్యా సంస్థలు అని అన్నారు. విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల లోని నాలుగు విభాగాలలో నైపుణ్యం కల్గిన అధ్యాకులచే నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని అన్నారు. యలమంచిలి సంస్థలకు సుమారు 30 దేశాలలో అనేక రంగాలలో సంస్థలు ఉన్నాయని అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. త్వరలో నర్సరీ నుంచి స్కూల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మా కళాశాలలో చదివే విద్యార్థులకు ఉద్యోగ భరోసాను యలమంచిలి తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో చేర్పించాలని, దూర ప్రాంతాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సూచించారు. విద్యార్థులకు యలమంచిలి విద్యా సంస్థలు అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ సూచించారు.

# దుస్తుల పంపిణీ



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని పనుకుమడుగు చెంచుగూడెంలో బట్టలు పంపిణీ, అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కడప జిల్లా కో-ఆర్డినరీ క్యాపిటల్ రాముడు, లాయర్ శ్రీనివాస చౌదరి, రమేష్ రెడ్డి, నాగభూషణం, వెంకటయ్య, మణికంఠ, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పాల్గొని ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం గూడెంలోని గిరిజను లందరూ పాల్గొన్నారు. సమగ్ర గిరిజన అధ్యక్షులు అనుమల రవికుమార్, చెంచు గూడెంలో బట్టల పంపిణీ, అన్నదానం చేయడం జరిగింది. దాతలు సహకారం తోటి తణుకు మడుగు గూడెంలో సుమారు 100 మంది గిరిజన మహిళలకు, పురుషులకు అదే విధంగా చిన్న పిల్లలకు అందరికీ బట్టలు పంపిణీ చేయడం జరిగింది.

# కామ్రేడ్ సయ్యద్ మహమ్మద్ కైఫ్ జ్ఞాపకార్థం బోరు ఏర్పాటు



కనిగిరి, మేజర్‌న్యూస్: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్ కుమారుడు కామ్రేడ్ సయ్యద్ మహమ్మద్ కైఫ్ జ్ఞాపకార్థం కనిగిరి మున్సి పాలిటీ పరిధిలోని పొగాకు పోర్టు వెనుకవైపు ఉన్న గుజ్జుల ఎలమందారెడ్డి కాలనీలో 100 మంది పేద దళిత కుటుంబాలకు నీటి వసతి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ కుమారుని జ్ఞాపకార్థం పేద కాలనీవాసులకు 300 అడుగుల మేర బోర్ వేయించి చేతిపంపు ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. త్వరలో కాలనీ వాసులకు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి చొరవతో విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బడుగు బలహీన వర్గాల పేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు కల్పించి, ఇంటి స్థలాలు ఉన్న పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా సిపిఐ పార్టీ తరఫున భరోసా ఇస్తామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎర్రజెండా అండగా ఉంటుందని , సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, ఏఐవైఎఫ్ నాయకులు పుట్టా సుబ్బారావు ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్ కళ్యాణ్, ఏఐటి యుసి నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఖాసింవలి పాల్గొన్నారు.

# వరి నారుమళ్లను సిద్ధం చేస్తున్న రైతన్నలు





త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విద్యుత్ బోరు బావుల కింద వరి నారు మళ్లను రైతులు సిద్ధంచేస్తు మొక్క కట్టిన వరి వంగడాలను చల్లుతున్నారు. ఈ ఏడాది మహారాష్ట్ర కర్ణాటక ఎగువ భాగంలోని ఆల్మట్టి తుంగభద్ర నారాయణపూర్ జూరాల ప్రాజెక్టు నిండుతున్నాయి అనే సమాచారం. ఎగువ బాగానే ఉన్నా ప్రాజెక్టులన్ని నీటితో నిండిపోతే శ్రీశైలం నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు యెహూ వాగాన గల ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో త్రిపురాంతకం మండలంలోని నాగార్జునసాగర్ ఆయకట్టు భూముల్లో త్రిపురాంతకం, గణపవరం, ఎండూరువారి పాలెం, సోమేపల్లి, గొల్లపల్లి, విశ్వనాధపురం, శ్రీనివాస నగర్, గాంధీనగర్, గుట్టల ఉమ్మడివరం తదితర గ్రామాల్లో రైతన్నలు ముందస్తుగా భూములు దుక్కులు దున్ని విద్యుత్ బోరుబావుల కింద వరి నారుమళ్లను రైతులు సిద్ధం చేస్తున్నారు. కొందరైతే ఇప్పటికే నీరు రావని మెట్ట ప్రాంతాల్లో కంది మొక్కజొన్న గింజలను నాటుతున్నారు. కొందరు అరకలతో, ట్రాక్టర్లపై జెడ్డిగాలు బిగించి గొర్రుతో సాలు సాలుకు ఏదో పెడుతున్నారుఎద పెడుతున్నారు. గత నాలుగు రోజులుగా కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు రైతులంతా వర్షాలు సక్రమంగా పడితే ఎలా చేయాలనీ నిండి రైతుల ఆశలకు అనుకూలంగా పైర్లు వేసుకునే దానికి ఎంతో సానుకూలంగా ఉండే అవకాశం ఉందని రైతాంగం అంతా అప్పు చేసి తిండి గింజలు పండించుకోవాలని ఆశాభావంతో వ్యవసాయానికి సమయతమవుతున్నారు.

# శ్రీశైలంలో 'డా.మద్దాళి' కి నేషనల్ సేవా సామ్రాట్‌భూషణ్ పురస్కారం

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః ఎల్.సి.ఇ.యస్.ఫౌండేషన్ మరియు లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైలం దేవస్థానంలోని కళావేదికపై జాతీయ కూచిపూడి నాట్యసమేళనం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీమకుర్తి పట్టణానికి చెందిన శ్రీ అభయ సేవా సాంస్కృతిక సాహిత్య సంస్థ మరియు శ్రీ అభయ సేవా ఫౌండేషన్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డా.మద్దాళి మాధవరావుకు నేషనల్ సేవా సామ్రాట్ కళా భూషణ్ పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని శ్రీశైలం దేవాలయ కార్యనిర్వహణాదికారి పెద్దిరాజు చేతుల మీదగా అందుకున్నారు. ముఖ్యఅతిదిలుగా ఎన్.హెచ్.ఆర్.ఓ.వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శేఖర్, ఇమ్మడిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎల్‌సిఇయస్ ఫౌండేషన్ ప్రతినిది మాట్లాడుతూ చీమకుర్తి పట్టణానికి చెందిన డా.మద్దాళి మాధవరావు నాలుగువేలకు పైగా కళారంగంలో మరియు సేవా కార్యక్రమాలతో పాటు దాదాపు 600 పురస్కారాలతో రజత పతకాలు 30, 25 స్వర్ణ కంకణాలు, నంది పురస్కారాలు, ఢీల్లీ, చెన్నై, తెలంగాణా, బెంగుళూరు తదితర రాష్ట్రాల నుంచి 6 గౌరవ డాక్టరేట్లు అందుకోవటంతో పాటు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్సు మరియు బిరుదులు అందుకోవటం చిన్న విషయం కాదని, ఇది కేవలం మాధవరావుకే సాధ్యమయ్యిందని కొనియాడారు. లిటిల్‌చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా సెక్రటరీ బుచ్చేశ్వరరావు మాట్లాడుతూ కష్టాలేమి కొత్తవి కాదని, ఆకలి వేసిన ప్రతి వాడి




కడుపును నింపి నింపడమే డా.మద్దాళి మాధవరావు లక్ష్యమని అలానే ఎందరికో స్ఫూర్తిదాతగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డా.మద్దాళి మాధవరావు మాట్లాడుతూ తనకు అవార్డుల రావటం పట్ల ఆనందంగా ఉందని, అంతే కాకుండా మరింత బాధ్యత పెంచిందన్నారు. త్వరలో చీమకుర్తి పట్టణంలోని ఘంటసాల విగ్రహం ప్రక్కనే స్వర్గీయ గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని దాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేస్తున్నట్లు విలేకర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిదిలుగా డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.నాగరాజు,విధ్యావేత్త డా.కె.రవిబాబు, కళావిభూషణ్ సామ్రాట్, సినీ గేయరచయిత డా.మధురశ్రీ,షేక్ నాజీర్ అహ్మద్‌తో పాటు మద్దాళి మాధవరావు కు పలు స్వచ్ఛంద సంస్థలు, కళాసంస్థలు, బ్రాహ్మణ సేవా సమితి కమిటి సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

# ప్రజలకు డెంగ్యూపై అవగాహన



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ సకాలంలో సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరును, ఇంట్లో నీటిని ఎక్కువగా నిలువ ఉండకుండా చేయాలని చేతులు ప్రతిరోజు పరిశుభ్రంగా కడుకోవాలని పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులను నివారించవచ్చని జ్వరాల పట్ల జాగ్రత్త వహించవద్దని డయేరియా కూడా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని వర్షాకాలంలో చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువ. ప్రజలు సురక్షితంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం ఎక్కువరోజులపాటు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని వారు చెబుతున్నారు. అవసరమైన మందులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరియు ఆశా వర్కర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రంగనాయకులు, సూపర్వైజర్ సుధారాణి, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా తారు రోడ్డు పనులు



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలోని మొగళ్లూరు నుండి ఇమ్మడి చెరువు దగ్గరికి 10 కిలోమీటర్ల దూరం సింగల్ లేరు తారు రోడ్డు మంజూరు కాగా నేడు పనులను చురుగ్గా సాగుతున్నవి ఈ రహదారికి కోటి 80 లక్షలు మంజూరు కాగా గత నాలుగు రోజుల నుంచి తారు రోడ్డు పనులు ఊపొందుకున్నాయి. గతంలో ఈ రోడ్డులో గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యే కాగానే అభివృద్ధి పనులు చేపట్టడంపై మండల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. మండలంలో మార్పు కనిపిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు.

# పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ



పామూరు, మేజర్‌న్యూస్: యువ భారత్ ఫౌండేషన్ సహకారంతో మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు బోడ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ ఆల్ ఇన్ వన్, జామెంట్రీ బాక్స్ లను శుక్రవారం పంపిణీ చేశారు. సమాజంలో జీవిస్తున్న ప్రతి మనిషి తన బాధ్యతగా సంపాదనలో కొంత పేదలకు సాయం చేయాలని అందులో ఆనందం ఉంటుందన్నారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం పట్ల పాఠశాల సిబ్బంది యువ భారత్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మార్నేని రామారావు, పోకా లోకనాథం, డి.శ్యామల, టి.ఝాన్సిరాణి, యమ్.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమానికి వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు సాయం



చీరాల, మేజర్ న్యూస్: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుడు అయిన చుండూరు వెంకటకోట ఆంజనేయులు వృద్ధాశ్రమానికి బియ్యం బస్తాను బహూక రించారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్‌లో శుక్రవారం కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి చుండూరు వెంకటకోట ఆంజనేయులు పుట్టిన రోజు సందర్భంగా బియ్యం బస్తాతో పాటు నిత్యవసర వస్తువులను కూడ అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారుగుళ్ళ గురుప్రసాద్, అమరా వీరాంజనేయులు, వంగర పూర్ణచంద్రరావు, మధుసూధనరావు, గుద్ధంటి రమేష్, జగన్మోహనరావు, జీవై ప్రసాద్, చెన్న నారాయణ, శ్రీనివాసరావు, నారాయణమూర్తి, నాగేశ్వరరావు తదితర వాకింగ్ సభ్యులతో పాటు ఆశ్రమ నిర్వాహకుడు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యంగా సేవలు

- 21న చిన్నగంజాంలో ఉచిత మెగా వైద్య శిబిరం
- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోండి
- ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- నియోజకవర్గంలో హాస్పిటల్ బ్రాంచ్ ఏర్పాటు చేస్తాం
- వైద్య సేవలకు పలు గ్రామాలను దత్తత
- విలేకరుల సమావేశంలో రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత
- సేవా కార్యక్రమాలలో ఎమ్మెల్యే ఏలూరి మేటి
- విక్రమ్ నారాయణ, డాక్టర్ కార్తీక్




పర్చూరు, మేజర్‌న్యూస్: పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధతో చూపుతున్న ప్రోత్సాహం మరువలేనిదని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లాయిడ్ ఫార్మా ఎండి విక్రమ్ నారాయణ, డాక్టర్ ఎలవర్తి కార్తీక్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ,ఆస్టర్ రమేష్ ఒంగోలు హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న చిన్నగంజాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. అపార అనుభవం కలిగిన కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ ,ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, విభాగాల ప్రముఖ వైద్యులతో పాటు 180 మందికి పైగా వైద్య సిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ధోరణితో ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో కూడా నియోజకవర్గంలో క్యాంపులు ఏర్పాటు చేశామని ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రస్తుతం తరుణంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు అవసరమని పరీక్షలు నేపథ్యంలో అనేక వ్యాధులు బయటపడుతున్నాయని ఆమె తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. యువ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ లాంటి వ్యక్తులు గ్రామాలకు సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

## గ్రామాలను దత్తత తీసుకుంటాం...

- పోతినేని రమేష్ బాబు

గ్రామాలలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సూచనల మేరకు దత్తత తీసుకుంటామని రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. పోతినేని రమేష్ పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చూపిన చొరవకు రమేష్ హాస్పిటల్ బ్రాంచ్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ప్రజలకు తమ వంతు బాధ్యతగా వైద్య సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యంతోపాటు ప్రజల ఆరోగ్య బాధ్యతను తీసుకుంటామన్నారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

## వైద్య సేవలలో ఎమ్మెల్యే ఏలూరి మేటి....

ప్రజలకు రాజకీయాలకు అతీతంగా వైద్య సేవలు అందించడంలో ఎమ్మెల్యే ఏలూరికి సాటి లేరని ప్రముఖ పరిశ్రమకు వేత్త లాయిడ్ ఫార్మా ఎండి విక్రమ్ నారాయణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ కార్తీక్ లు పేర్కొన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఏలూరి తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారని కొనియాడారు. అనేక మందికి నేత్రదానం మోకాలు ఆపరేషన్లు నిర్వహించారని గుర్తు చేశారు ఎమ్మెల్యేగా ప్రజల అభివృద్ధి సంక్షేమం కాంక్షిస్తూ... మరోవైపు తన తండ్రి ట్రస్ట్ పేరుతో పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరి బాగోగులు తెలుసుకుంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఎమ్మెల్యే ఏలూరికే సాధ్యమైందన్నారు. అతిపెద్ద కార్డియాలజీ హాస్పిటల్ ఏర్పాటు చేసి విజయవాడ నుంచి తిరుపతి వరకు అనేక ఏళ్లుగా రమేష్ హాస్పిటల్ వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

## చిన్నగంజాంలో క్యాంప్ ఏర్పాటు...

మారుమూల వెనుకబడిన ప్రాంతమైన చిన్నగంజాం లో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో క్యాంప్ ఏర్పాటు చేస్తున్న రమేష్ హాస్పిటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయదారితమైన సామాన్య మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా ఉన్న చిన్నగంజాం లో కార్పొరేట్ వైద్యం అందించేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ అత్యధిక సంఖ్యలో హాజరై క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, యద్దనపూడి మండల అధ్యక్షుడు రంగయ్య చౌదరి, పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, కారంచేడు మండల అధ్యక్షుడు శ్రీహరి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు తొండెపు ఆదినారాయణ, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



# ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రతి శుక్రవారం జరిగే ఫిజియోథెరపీ దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యం.ఇ.ఓ-1 బి.మస్తాన్ నాయక్ తెలిపియున్నారు. శుక్రవారం స్థానిక యంఆర్సీ నందు జరిగిన ఫిజియోథెరపీ కార్యకమాన్ని తనిఖీ చేసి విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి వారం జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులను తప్పక తీసుకొని రావాలని, ఫిజియోథెరపీ కొంత మేరకు ఉపశనం ఉంటుదన్నారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధముగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కృషి చేయాలన్నారు. ఫిజియోథెరపీ కోటేశ్వర రావు, ఐ.ఆర్.టి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కస్తూరిబా పాఠశాల ఆకస్మిక తనిఖీ

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన వెలిగండ్ల కస్తూరిబా పాఠశాలను శుక్రవారం జిల్లా స్వరాభిక్ష అభియాన్ అధికారిణి సిహెచ్ మాధవి లత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇప్పటినుంచే చదువుపై శ్రద్ధ వహించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆమె విద్యార్థు లకు సూచించారు. అనంతరం పాఠశాల మొత్తం కలియ చూసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు గణిత శాస్త్రంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుశీల, పాఠశాల ఉపాధ్యాయురాలు కొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు కేంద్రం ప్రారంభం



వేటపాలెం, మేజర్‌న్యూస్: స్థానిక గడియారం స్తంభం సెంటర్ నందు ప్రజలకు అందుబాటులో నిత్యవసర వస్తువుల కేంద్రాన్ని ప్రారంభించి తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. బియ్యం కిలో రూ.49లు, ముడి బియ్యం కిలో రూ.48లు, దేశి వాలి కందిపప్పు కిలో రూ.160లు, చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్ దాల్ మిల్లర్ అసోసియేషన్లు లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎవరైనా సరే ఆధార్ కార్డు చూపించి బియ్యం కందిపప్పు కొనుగోలు చేయవచ్చు అన్నారు. ఎక్కడైనా అక్రమ నిలువలు కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పియంశ్రీ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు




వెలిగండ్ల, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రధాన మంత్రిశ్రీ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకచర్యలు తీసుకుం టున్నట్లు ఎంఇఓ ఆర్.కొండారెడ్డి అన్నారు. పియంశ్రీ పాఠశాలకు ఎంపికైన సి.ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వసతులు విద్యాబోధన పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పియంశ్రీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పియంశ్రీ నిధులతో పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, ఫర్నీచర్, ల్యాబరోటరీ, కంప్యూటర్ ల్యాబ్, స్మార్ట్ తరగతి గదులు, క్రీడామైదానం అభివృద్ధి, గ్రంధాలయం ఏర్పాటు తదితర వసతులు సమకూర్చుకునేందుకు ఉపయోగించుకుని పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు అన్నివసతులు కల్పించవచ్చని పియంశ్రీ నిధులు పాఠశాలఖాతాలో జమచేయబడుతుందని మన పాఠశాల ఎంపిక కావడం మనందరికి గర్వకారణం అని అందుకనుగుణంగా ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు వచ్చేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యార్థులు పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఎంఇఓ అన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీచేసి ప్రభుత్వం సూచించిన మెనూప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుకింగ్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నిసాబేగం, సీఆర్పీ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 25 వరకు డిగ్రీలో అడ్మిషన్లకు గడువు

దోర్నాల, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఈ నెల 25వ తేదీవరకు అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డా.యస్.సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.ఏ (పొలిటికల్ సైన్స్), బి.కాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బియస్సీ (కంప్యూటర్ సైన్స్), బియస్సి (బోటనీ, హార్టికల్చర్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత సంవత్సరం జరిగిన యూనివర్సిటీ ఫలితాలలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. తదుపరి మాట్లాడుతూ బోధనా పరంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు సాధించిన అధ్యాపకులు భోధిస్తున్నారు అని తెలిపారు. చివరగా ఈ సదవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులు వినియోగించుకొని తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు.



# ట్రిపుల్ ఐటి సీటు సాధించిన విద్యార్థినికి ఘన సన్మానం

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఈ సంవత్సరం 10వ తరగతిలో ట్రిబుల్ ఐటీ సాధించిన బాలికను స్థానిక ఎంఈఓలు దాస్ ప్రసాద్, దేవి రెడ్డి రామిరెడ్డి ఆ విద్యార్థినిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బాలికనే రాబోవు సంవత్సరంలో ఎక్కువ మంది ట్రిబుల్ ఐటీలో సీటు సాధించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మరమ్మత్తులు గురైన చేతిపంపు... పట్టించుకోని అధికారులు



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని జాళ్లపాలెం ప్రాథమిక పాఠశాలలోని చేతి పంపు మరమ్మత్తులు గుర్రై 10 రోజు నిరుపయోగంగా పడి ఉన్నది. ఈ బోరుకు చేతిపంపు రిపేర్ చేయుటకు పైపులు బయటకు తీసి మరమ్మత్తులు చేయకుండా మర్చిపోయారు. విద్యార్థులకు మంచినీరు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే ఆ బోరు పైపును రిపేర్ చేయవలసిందిగా ఆ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు కోరుతున్నారు.



## నిత్యావసర వస్తువుల ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన నిజాంపట్నంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు నిత్యావసర వస్తువులు అమ్మకంచేసే ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కౌంటర్లో ఫైన్ రకం స్టీమ్ బియ్యం, ఫైన్ రకం ముడిబియ్యం, దేశవాళీ కందిపప్పులను తక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని చేయూత మహిళా మార్ట్ సందర్శించారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, నాయుడు నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ట్రెజరీ, ఆడిట్, ఎండోమెంట్స్ శాఖల అధి కారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పుష్పాలత, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె. కరీం భాషా, జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాధ రావు, స్టేట్ ఆడిట్ ఆర్.డి.డి నాగ శ్రీనివాస రావు, జిల్లాఆడిట్‌అధికారి శంకర్ నారాయణరెడ్డి, దేవాదాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన





బాపట్ల మేజర్‌న్యూస్: వర్షాలు అధికమై వరద వస్తే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కోరారు.బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కృష్ణానది అరవింద వారధి, పెసర్లంక, చిలుమూరులంక, సుగ్గనలంక, పెద్దలంక, చింతర్లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వరద ప్రమాదానికి గురయ్యే గ్రామాలలో ప్రజలతో మాట్లాడారు. గత అనుభవాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు, విపత్తు రాకముందే ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. లంక గ్రామాలలోని ప్రజలంతా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం విపత్తు నిర్వహణపై జిల్లా అధికారులతో కొల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు చాలా విలువైనవని, ఎవరికి ఎలాంటి హాని జరగరాదని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. కృష్ణానదిలంక గ్రామాలకు ముంపు ఉన్నందున ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. అధిక వర్షాలు కురుస్తాయని ప్రకటనతో కృష్ణా నది ప్రకాశం బ్యారేజీలోకి వరద నీరు చేరితే దిగువకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. నీరు అధికమైతే ఆరు లంక గ్రామాలలోని 14 ఆవాస ప్రాంతాలకు నీరు చేరుతాయన్నారు. ప్రస్తుతం 56 బోట్లు, 100 మంది గజ ఈతగాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్‌డిఏ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల వద్ద పడిన గండి పూడ్చడానికి తాత్కాలిక, ప్రణాళిక శాశ్వత ప్రణాళికను రూపొందించి తక్షణమే నివేదిక పంపాలన్నారు. అధిక వర్షాలతో లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. అంటువ్యాధులు ప్రభలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విపత్తు నిర్వహణ సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే సమస్యలు తలెత్తకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో బ్లీచింగ్ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశునష్టం జరగకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డంగా చెట్లుకూలినా, గోడలు కూలిపోతే తక్షణమే తొలగించడానికి సహాయక చర్యలకు అవసరమైన యంత్రాలు మండల కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించడానికి అవసరమైన వాహనాలు ముందుగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ కి 12 అడుగు లకు వరద నీరు మించితే నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మొదటి హెచ్చరికగా భావించి గ్రామస్తులు బయటకు రావడానికి సిద్ధంగా ఉండి అధికారులకు సహకరించాలన్నారు. నీటి ప్రవాహం పెరిగే కొద్దీ లంక గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద విపత్తు నేపథ్యంలో అను బంధశాఖల అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలలో మంచి భోజనం ఏర్పాటు చేయడానికి నిత్యవసర సరుకులు, గ్యాస్ సిలిండర్లు ముందుగా నిల్వ చేసుకోవాలన్నారు. అధికారులు అజాగ్రత్తతో ఉండరాదని హెచ్చరించారు. ఎక్కడ ఏ సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# పెండింగ్ ఫిర్యాదుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ఒంగోలులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలి**

**మహిళల భద్రత, రక్షణ కోసం మహిళా పోలీస్‌లు అహర్నిశలు పనిచేయాలి**

**ఒంగోలు ట్రాఫిక్, టు టౌన్, మహిళా పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : పెండింగ్ ఫిర్యాదుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులో పర్యటించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, టు టౌన్ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని పలు గదులను, రికార్డ్స్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. టౌన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలని, తగినన్ని బారికేడ్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ, టౌన్‌లో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మోడీపై సైలెన్సర్లపై నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వాహనధారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్గించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య, ఎస్‌బి సీఐ రాఘవేంద్ర, సిబ్బంది ఉన్నారు.

**మహిళా పోలీసు స్టేషన్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ**

ఒంగోలులోని ఉమెన్ పోలీస్‌స్టేషన్, ఒంగోలు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లను ప్రకాశం జిల్లా ఎస్పీ సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను, పిర్యాదులు, రిసెప్షన్ బుక్, జనరల్ డైరీ పలు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లలోని గదులు, చుట్టు ఉన్న పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో మ్యాన్ పవర్ అవసరతను, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకొని పలు సూచనలు తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న పిర్యాదుధారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను అడిగి తెలుసుకొని వారి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులను సమీక్షించి ఆయా కేసుల నమోదు, దర్యాప్తు పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి గురించి తదితర విషయాలు గురించి అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, నేర దర్యాప్తులో ప్రత్యేక టీంలుగా ఏర్పడి కేసులను ఛేదించాలన్నారు. గంజాయి మాదక ద్రవ్యలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, నేరాలు కట్టడి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, అంకితభావంతో, మానవతాదృక్పదంతో పనిచేయాలని, పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళల భద్రత, రక్షణ కోసం పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీస్‌లు అహర్నిశలు పని చేయాలని సూచించారు. స్టేషన్‌లో వివిధ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల అంకితభావంగా ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయుటకు వచ్చే ఫిర్యాదులు దారులు పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకొని వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్‌బి సిఐ రాఘవేంద్ర, ఒంగోలు టూ టౌన్ సిఐ జగదీష్ సిబ్బంది ఉన్నారు.



## పేద మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ

అద్దంకి, మేజర్ న్యూస్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో ఉన్నం శ్రీనివాసరావు జ్ఞాపకార్ధం వారి మనుమడు ఆహాన్స్, మనుమరాలు రీతూష సౌజన్యముతో పట్టణంలోని కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది.అలాగే రాజీవ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 4 కుర్చీలు బహుకరించారు. రోటరీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షులు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. ఆర్థిక సహాయం చేసిన ఆహాన్స్, రీతూషలను పలువురు వక్తలు అభినందించారు. కుట్టుమిషన్ అందుకున్న లావణ్య మాట్లాడుతూ తను అడిగిన వెంటనే రోటరీ సభ్యులు కుట్టు మిషన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధికారి ఊటుకూరు ఉమా అన్నపూర్ణ మాట్లాడుతూ మంచి సేవాకార్యక్రమాలు చేస్తున్న రోటరీ సంస్థను అభినందించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, పాస్ట్ ప్రెసిడెంట్ చిన్ని మురళీ కృష్ణ, పసుపులేటి ఆంజనేయులు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



పొదిలి ,మేజర్ న్యూస్ : స్థానిక అమృత కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం సన్ షైన్ పాఠశాలలో 300 మంది విద్యార్థిని విద్యార్థులకు వైద్యాధికారులు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అమృత హాస్పిటల్ ఎండి వరికూటి భరత్ తెలిపారు.శనివారం రెండవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్ , సన్ షైన్ పాఠశాల ఉపాధ్యాయులు, అమృత హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని 11వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారంగా సక్రమంగా పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలోని పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి ఉపాధ్యాయులపై ఆగ్రహ వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఆవరణ అపరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు సీజనల్ వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని పరిశుబ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు, మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై అవగాహన

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారిని డాక్టర్ సోనీ ఆధ్వర్యంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వైద్యాధికారిని డాక్టర్ వి,సోనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వైద్య రంగం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి అన్నారు. వైద్యరంగం అనేది ఆరోగ్యపరంగా ప్రాణాలను కాపాడే వ్యవస్థ అని అన్ని వృత్తుల కంటేఅమోఘం అన్నారు. ఈ వృత్తిని అవలంబించాలనుకునే ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే క్రమశిక్షణతో, పట్టుదలతో, ఒక పథకం ప్రకారం ప్రణాళికలను రూపొందించుకొని విద్యలో రాణించాలన్నారు. అలా సైన్స్ పరంగా ప్రముఖ వైద్య నిపుణుల శిక్షణలో మెలిగి మంచి ప్రావీణ్యం సంపాదించినాడు వైద్యరంగంలో



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అప్పుడే మీ పేరు ప్రఖ్యాతులు వైద్య రంగంలో అత్యున్నతస్థాయికి చేరుతారన్నారు. అనంతరం కెరీర్ ఎడ్యుకేషన్ పాఠశాల కోఆర్డినేటర్లు ఎన్.భాగ్యలక్ష్మి, ఏ.ఆదిలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్, ఉపాధ్యాయులు మండల వైద్యాధికారిని డాక్టర్ సోనీ, ఎంపిహెచ్ఎస్ నాగేశ్వర రావులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డెంగ్యూ బాధితుడిని పరామర్శించిన వైద్య బృందం



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: స్థానిక అంబేద్కర్ నగర్ నందు డెంగ్యూ జ్వరం సోకిన బాధితుడైనా ధర్నాసి మోషే 20 అనే యువకుడ్ని శుక్రవారం ఆరోగ్య స్థితిగతులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.సురేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ బి.మాధవి, జిల్లా లెప్రసీ అధికారిణి డి.శ్రీవాణి, సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.హరిణి, వైద్య పంచాయితీ బృందం విచారించారు. డెంగ్యూ సోకిన బాధితుడు కాలనీ అంబేద్కర్ నగర్లో వైద్యారోగశాఖ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏబేట స్ప్రేయింగ్ ఇళ్లలో ఐఎస్ఎస్ ప్లేయింగ్ యాంటీ లార్వా తదితర చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని డీఎంహెచ్ఓ సురేష్ గ్రామస్తులకు అవగాహన కలిగించారు. దోమతెరలు వాడాలన్నారు. వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకులను డ్రై డేగా పాటించాలన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కాలనీలో బ్లీచింగ్ చేపట్టారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ సూచనలు సలహాలు ఇచ్చారు. డెంగ్యూ జ్వరం సోకిన బాధితుడు మోసే ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని మెడికల్ ఆఫీసర్ హరిని తెలిపారు. సంతనూతలపాడు ఒకటవ అంబేద్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో వైద్యారోగ్య శాఖచే చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.సాగర్ సిహెచ్ఓ ఆర్.ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి, అంగన్వాడి టీచర్ మరియమ్మ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నందనమారెళ్లలో భూ ప్రకంపనలు

కనిగిరి, మేజర్‌న్యూస్: మండలంలోని నందన మారెళ్ళ గ్రామంలో పెద్ద శబ్దంతో భూ ప్రకంపనలు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో నాలుగు సెకండ్ల పాటు భూమి కనిపించడంతో ఇళ్లలోని వస్తువులు కింద పడిపోవడంతో భయంతో ఇళ్ల నుండి బయటకి పరుగులు తీశారు. గతంలో కూడా ఇదే గ్రామంలో భూప్రకంపనలు వచ్చాయి. ఇప్పటికి రెండుసార్లు ఒకే గ్రామంలో భూ ప్రకంపనలు రావడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు గ్రామంలో పర్యటించి భూ ప్రకంపనలు ఎందుకు వస్తున్నాయో నిర్ధారించి, భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## భీమవరం టీ టైమ్‌ను ప్రారంభించిన కృష్ణ కిషోర్



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణం లోని క్లబ్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ సమీపంలో పట్టణానికి చెందిన గుర్రపుశాల రాజు నూతనంగా ఏర్పాటు చేసిన భీమవరం టీ టైమ్ ప్రారంభోత్సవంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వ్యాపారం రుచికరంగా దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియచేశారు.

## కెజిబివిని తనిఖీ చేసిన జిసిడిఓ మాధవిలత





సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంను శుక్రవారం బాలికా శిశు అభివృద్ధి అధికారిణి సిహెచ్. మాధవిలత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా విద్యార్థినుల నమోదు హాజరు ఇతర రికార్డులు పరిశీలించారు. అనంతరం తరగతి గదులను ఉపాధ్యాయునుల విద్యాబోధన పరిశీలించి విద్యార్థినులను పలుప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులను కెజిబివిలో వసతుల కల్పన, పౌష్టికాహారం, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెజిబివిలో వంటగదులు సందర్శించి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, భోజనం పరిశీలించి వంటగదులు పరిశుభ్రంగా ఉంచుకుని నాణ్యమైన రుచికరమైన పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం సూచించిన మెనూ తప్పనిసరిగా అమలుచేయాలని నిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యాలయం పరిసరాలను పరిశీలించి పిచ్చిమొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులను బయటకు రాకుండా చూడాలని విద్యార్థినుల సంరక్షణకు సిబ్బంది భాద్యత అని సూచించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్, పదవతరగతి విద్యార్థినులకు కష్టపడి చదువుకుని ఉత్తమఫలితాలు సాధించి కెజిబివికి మంచిపేరు తీసుకురావాలని అదేవిధంగా విద్యార్థినులు ఎటువంటి భయాందోళన లేకుండా తమసందేహాలు సిబ్బందికి తెలిపి నివృత్తి చేసుకోవాలని మహిళలను సమాజంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించినట్లు జీసీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ మాధవిలత, కెజిబివి ప్రత్యేక అధికారిణి షేక్ రేష్మా,సిబ్బంది ఉన్నారు.

## గ్రామ గ్రామాన సంఘాన్ని నిర్మిద్దాం



ఒంగోలు, మేజర్‌న్యూస్: గ్రామ గ్రామాన కెవిపియస్ సంఘాన్ని నిర్మించడం తోపాటు, దళితుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని ఎల్బీజీ భవనం నందు కెవిపియస్ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అద్యక్షులు జవ్వాజి రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ జిల్లా కమిటీ సభ్యుడు గద్దె జడ్సన్ కడప జిల్లా కార్యదర్శి సునీల్ కు నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ లేని పాలకవర్గాలు మన సమస్యలపై ద్రుష్టి పెట్టాలంటే అనగారిన మన సామాజిక తరగతుల్లో ప్రశ్నించే చైతన్యాన్ని పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి.మోజస్, కాలే మల్లికార్జున్ రావు, బక్క జేసురత్నం, జిల్లా కమిటీ సభ్యులు పరదేశి రాజశేఖర్, కొమ్ము బ్రహ్మయ్య, కొలనీడి నరేష్ పాల్గొన్నారు.

## సర్పంచ్ చెక్ పవర్ తొలగించే అధికారం డీ.పీ.ఓకు లేదు: వీరభద్రాచారి

ఒంగోలు, మేజర్‌న్యూస్: రికార్డులు చూపలేదని, నిధులు దుర్వినియోగం అయ్యాయని సర్పంచులుకు షోకాజ్ నోటీసులు ఇచ్చి,చెక్ పవర్ తొలగించే అధికారం జిల్లా కలెక్టర్ పేరుతో అధికారాన్ని చెలాయించే జిల్లా పంచాయితీ అధికారికి లేదని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీర భద్రాచారి స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో కార్యదర్శి వ్యవస్థ లేనపుడు మైనర్ పంచాయితీలలో మాత్రమే సర్పంచ్ బాధ్యుడని ఆయన గుర్తుచేస్తూ, నేడు ప్రతి గ్రామానికి కార్యదర్శి వ్యవస్థ వచ్చిన తర్వాత పరిపాలనా వ్యవహారాలతో పాటు,ఆర్థిక చెల్లింపులు, జమా ఖర్చుల నిర్వహణ ప్రభుత్వ నిభందనలు మేరకు చట్ట పరిధిలో నిర్వహించ వలసిన భాధ్యత కార్యదర్శిది మాత్రమేనన్నారు. రికార్డుల నిర్వహణ, భద్రత, పర్యవేక్షణ అధికారులకు చూపించ వలసిన భాధ్యత కార్యదర్శుల దన్న నిభందనలు తెలుసుకొని షోకాజ్ ఇవ్వాలని హితవు పలికారు. అవినీతి అధికారులను పోషిస్తున్న అధికారి జిల్లా పంచాయితీ అధికారి మాత్రమేనన్నారు. అవసరమైతే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డ్యూడి లను చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఈ సందర్భంగా వారి ఇరువురిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

చీరాల, మేజర్‌న్యూస్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రతినిధి లక్ష్మణ్ అన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం సబ్ స్టేషన్ 3 పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భిణీలు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే స్టేషన్లో ఉన్న రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రతినిదులు మాట్లాడుతూ గర్భిణీల స్థితిగతులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

## పొదిలిలోని పలు ప్రాంతాలలో స్వల్ప భూకంపం

పొదిలి,మేజర్‌న్యూస్: పట్టణంలో శుక్రవారం రెండు సెకన్ల పాటు భూమి కంపించింది.సుమారు ఉదయం 6.20 గంటల సమీపంలో పట్టణంలోని శివాలయం బజార్,రథంరోడ్డు,అమ్మవారిశాల వీధి,ఆంజనేయస్వామి వీధి,గుద్దేటివారివీధి,విశ్వనాథపురంలోని పలు ప్రాంతాలతో పాటు మండలంలోని కంబాలపాడు గ్రామంలో భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.భూ ప్రకంపణాలను ప్రత్యక్షంగా చూసిన ప్రజలు ఆందోళనకు గురయ్యారు.ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఉంటుందని అనుకున్న ప్రజలకు రెండు సెకన్ల పాటు భూమి కంపించిందన్న విషయం తెలుసుకొని అవాక్కయ్యారు.మండలంలో స్వల్పంగా భూమి కంపించిందన్న విషయం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అయితే ఎలాంటి నష్టం వాటిల్లక పోవడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



## అక్రమ లేఔట్లు ఉపేక్షించేది లేదు

– కనిగిరి ఆర్డీవో జాన్ ఎర్విన్

పొదిలి,మేజర్‌న్యూస్: అక్రమ,అనధికార లేఔట్లు వేస్తే ఉపేక్షించేది లేదని,అట్టి లేఔట్లు వేసిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి ఆర్డీవో జాన్‌ఎర్విన్ అన్నారు.శుక్రవారం యన పొదిలి,కొనకనమిట్ల మండలాలలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్‌మెంట్ భూముల్లో ,పట్టాభూముల్లో అనుమతులు లేకుండా లేఔట్లు వేయడం చట్టరీత్యా నేరమన్నారు.అట్టి లేఔట్లను రెవిన్యూ సిబ్బంది పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.అలాగే కౌలు రైతు కార్డుల మంజూరు, కులధృవీకరణ పత్రాల విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రెవిన్యూ సిబ్బంది పని చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో పొదిలి,కొనకనమిట్ల తహసిల్దార్లు మహమ్మద్ జియా,షేక్ సాజిదా,ఇన్‌చార్జి ఆర్ఐ కిలారి సుబ్బారావు,విఆర్వోలు పాల్గొన్నారు.

# విద్యకు టిడిపి ప్రభుత్వం పెద్దపీట





పొదిలి,మేజర్‌న్యూస్: విద్యకు తెలుగుదేశం ప్రభుత్వం పెద్ద పీఠ వేసిందని పలువురు టిడిపి నాయకులు అన్నారు.శుక్రవారం స్థానిక జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు.సిఎం చంద్రబాబు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థుల కష్టాలను తెలుసుకొని ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమంది పిల్లలకు అమ్మఒడి అందిస్తామని హామీ ఇచ్చారన్నారు.విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో సిఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి జూనియర్ కాలేజీలో హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీనిచ్చారు.అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలను అందజేశారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్,మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్,మండల కన్వీనర్ మీగడ ఓబులరెడ్డి,పట్టణ కన్వీనర్ ముల్లా ఖుద్దూస్,టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్‌బాషా,మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలానీబాషా,మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున,షేక్ మౌలాలి,వీరిశెట్టి సురేష్,ప్రిన్సిపల్ తారావాణి,అధ్యాపకులు షేక్ షకీనాబీ,వి రామలక్ష్మి,కె వెంకటేశ్వర్లు,సిహెచ్ సుబ్బారెడ్డి,ఎంవి రమణారెడ్డి,ఎం శాంతికేజియా,యుఎల్ నరసారెడ్డి,వివి రమణారెడ్డి,ఎస్‌డి యాస్మిన్,ఎస్‌కె ఆర్ఎం సుభానీ,పి సుజాత,బి సాలమ్మ,ఎన్ యేసయ్య,వై శాంతిప్రియ,ఎల్ పద్మారావు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్పపీడనంతో భారీ వర్షాలు

### విత్తనాలు నాటే రైతులు వాయిదా వేసుకోవాలి

పంగులూరు, మేజర్ న్యూస్: మధ్య బంగాళా ఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో పంగులూరు మండలంలోని పలు ఖరీఫ్ పంటలకు విత్తనాలు నాటుకునే రైతులు ప్రస్తుతం వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె. సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడిందని, ఈ అల్పపీడనం ఆంధ్రప్రదేశ్ తీరం సమీపంగా పయనిస్తూ, 24 గంటల్లో ఒడిస్సా రాష్ట్రం చేరే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపిందన్నారు. ఈ అల్పపీడనం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలకు భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం కూడా ఉందని సుబ్బారెడ్డి తెలిపారు. 19 సెంటీమీటర్లకు మించి వర్ష పాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందువలన వాతావరణ శాఖ వరుస హెచ్చరికల నేపథ్యంలో, విత్తనాలు భూమిలో నాటుకునే రైతులు వాయిదా వేసుకోవాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు.

## 21న రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పంగులూరు, మేజర్‌న్యూస్: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని, రోటరీ క్లబ్ క్యాంప్ ఇంచార్జి చిలుకూరి వీరరాఘవయ్య శుక్రవారం తెలిపారు. క్లబ్ అధ్యక్షులుగా షేక్ కాలేషావలి, కార్యదర్శిగా డాక్టర్ బత్తుల వీరనారాయణ, కోశాధికారిగా జాగర్లమూడి సుబ్బారావు (జేకేసి)లు ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ సందర్భంగా జరిగే కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్.వి. రాంప్రసాద్, గవర్నర్ అపాయింట్మెంట్స్ చైర్మన్ కొల్లా సింగారావు, అసిస్టెంట్ గవర్నర్ తెళ్ళ రమేష్ చంద్ర తో పాటు, ఇప్పటివరకు రోటరీ క్లబ్ పంగులూరు అధ్యక్షుడు గా పనిచేసిన కరణం హనుమంతరావు క్లబ్ సభ్యులు పాల్గొంటారని వీర రాఘవయ్య తెలిపారు.

## పార్కింగ్ స్థలంపై దృష్టి సారించరూ...



చీమకుర్తి, మేజర్‌న్యూస్: చీమకుర్తి పట్టణంలో ప్రధాన సమస్య వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాల సమస్య, ఇప్పటి వరకు ఎంతో మంది పోలీసు అధికారులు వస్తూనే ఉన్నారు...పోతూనే ఉన్నారు. చీమకుర్తిలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన సి.ఐ.అయినా పార్కింగ్ స్థలాలపై దృష్టి సారిస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, ఇసుకవాగు సెంటర్, బ్యాంకులు సమీపంలో ద్విచక్రవాహనదారులు నిలుపుకునే స్థలం లేక (పార్కింగ్ ప్లేస్) ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రధాన సెంటర్లల్లో ద్విచక్రవాహనాలు నిలుపుకునేందుకు స్థలాలు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతాలల్లో కిరాణా షాపులు, కూరగాయల దుకాణాలు, బట్టల షాపులు, టీ షాపులు ఇతర అన్ని రకాల షాపులు ఉన్నాయి. పట్టణ ప్రజలు ఏ వస్తువులు కొనాలన్నా ఈ సెంటర్లకు రావాల్సిందే. అయితే ఇక్కడెక్కడా కూడా పార్కింగ్ సదుపాయాలు లేవు. దీంతో సరుకుల కోసం షాపులకు వచ్చే వారు తమ ద్విచక్ర వాహనాలను ఎక్కడ నిలుపుకోవాలో తెలియని పరిస్థితి..వాహనాలు నిలుపుకొనేందుకు స్థలం లేకపోవడంతో కొందరు ఎక్కడబడితే అక్కడ రోడ్డు ప్రక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఇకనైనా పోలీసు శాఖ, మున్సిపల్ శాఖల అధికారులు పార్కింగ్ ప్లేస్‌లపై దృష్టిపెట్టి అన్ని ప్రధాన సెంటర్లలల్లో పార్కింగ్ సదుపాయం కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



## 8వ వార్డులో వాటర్ ట్యాంక్ ప్రారంభం

పొదిలి,మేజర్‌న్యూస్: ప్రజల నీటి కష్టాలను గుర్తించి మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం 8వ వార్డు ఇన్‌చార్జి ఎస్ఎం బాష ప్రారంభించారు.ఈ అవకాశాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ ముల్లా ఖుద్దూస్,మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు,మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి,ఎస్సీసెల్ నాయకులు దాగూర్ నాగేశ్వరరావు,ముక్కెర కిరణ్,ముల్లా జిలానీబాష,కన్వీనర్ ముల్లా ఖాదర్‌వలి, ఆమని, సందీప్,ఆనందరావు,రమేష్,వలి పాల్గొన్నారు.

## జి.ఎల్.పురంలో ఎంఆర్‌పియస్ జెండా ఆవిష్కరణ



చీమకుర్తి, మేజర్‌న్యూస్: ఎంఆర్‌పియస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం చిమకుర్తి మండలంలోని జి.ఎల్.పురం గ్రామంలో ఎంఆర్‌పియస్ జెండాను ఆవిష్కరించటం జరిగింది. అనంతరం నూతన గ్రామ కమిటీని రాష్ట్ర ఎం.ఈ.ఎఫ్.ఉపాధ్యక్షులు బొంత దాసు, ఎం.ఎస్.పి.జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్ ఆధ్వర్యంలో ఎన్నుకోవటం జరిగింది. గ్రామ అధ్యక్షులుగా ఒమ్ము యెహోను, ఉపాధ్యక్షులుగా గార్నెపూడి నాగేశ్వరరావు, గార్నెపూడి అహరోను, కార్యదర్శిగా జి.శింగయ్య, జి.ప్రతాప్, జి.ఇజాక్, లాజర్, పేతురు, జి.మోషేను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పియస్ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు పాటిబండ్ల జక్రయ్య, పాటిబండ్ల వంశీ, చీమకుర్తి మండల ఎంఆర్‌పియస్ అధ్యక్షుడు జడ విజయ్‌కుమార్, మండల నాయకులు బుట్టి సాల్మన్, ఆవులూరి విజయ్‌బాబు, కొలకలూరి ఆశీర్వాదం, పట్టణ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, శాలెం రాజ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండ్ బురదమయం



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన వెలిగండ్లలో స్థానిక బస్టాండ్ సెంటర్ ప్రాథమిక పాఠశాల దగ్గర కొద్దిపాటి వర్షానికి ఆర్ అండ్ బి రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచి చిన్న కుంటలాగా తయారై వాహన దారులకును ప్రయాణికులను ఆ నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. నిత్యము అధికారులు తిరుగుతున్న మండల కేంద్రం వెలిగండ్ల రహదారులు ఇలాంటి దుస్థితి ఏర్పడిగా గ్రామాల్లో ఇంకెలా ఉంటుందోనని అధికారులు ఊహించుకోవాలి కనుక సంబంధించి అధికారులు ఆర్ అండ్ బి రహదారులపై నీరు లేకుండా సైడ్ కాలం ఏర్పాటు చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.




## జిల్లా అధికారులను,పురపాలక కమిషనర్‌ను కలిసిన సమాజవాది పార్టీ సభ్యులు

బాపట్ల మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ జే వెంకట మురళి, జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డూడి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లను వారి వారి ఆఫీసులలో శుక్రవారం సమాజవాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు సహచర నాయకులతో కలిసి పూల బొకే లు దుశ్శాలువాలు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా అభివృద్ధి పదంలో నడిచే విధంగా విద్యాపరంగా ప్రముఖ కేంద్రంగా విలసిల్లుతున్న బాపట్ల ను ఉపాధి కేంద్రంగా వ్యాప్తి చెందటానికి కృషి చేయవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ నాయకులు విలియం బూత్ కళాశాల ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, సీనియర్ అడ్వకేట్ లంబు సాంబయ్య, అధ్యాపకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు, కంద్రూ శరత్ కుమార్, వ్యాపారస్తులు కొమ్మనబోయిన ఫణింద్ర, బోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలు గ్రామపంచాయతీలో షాడోలదే హవా!

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం (అజెండామీటింగ్)లో ప్రజల నుండి ఎన్నిక కాబడిన వారి కంటే మిన్నగా,షాడోల రాజ్యం సాగుతున్నదని వార్డు సభ్యులు వంగర వీరయ్య, సయ్యద్ ఇస్మాయిల్‌లు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాసర్పంచ్,మరియు ఆరుగురు వార్డు మహిళ సభ్యులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు.కానీ పంచాయితీ సమావేశంలో మహిళా వార్డు సభ్యులను అజెండాలోని సమస్యల పై చర్చించనీయకుండా, వారిని మాట్లాడనివ్వకుండా ప్రతి అంశంలో (మహిళాసభ్యుల భర్తలు) షాడోలే మాట్లాడే పాత్ర అధికమైందని వారు తెలిపారు. గత సమావేశాలలో కూడా షాడోలు గందరగోళం సృష్టించిన విషయాలు అనేకం ఉన్నాయ న్నారు. ఈ విషయమై పంచాయతీ శాఖ ఉన్నత అధికారులకు గతంలో అనేక మార్లు విన్నవించుకున్నా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అజెండాలోని ప్రతి సమస్యపై చర్చ జరగనీయకుండా మహిళా సభ్యుల భర్తలు గందరగోళం సృష్టించడం ఆనవాయితీగా మారిందని వారు పేర్కొ న్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి, అజెండాలోని అంశాలు సక్రమంగా చర్చించే విధంగా,గ్రామ పురోభివృద్ధికి పాటుపడే విధ ంగా సభ్యులకు సహకారం అందించాలని ఉన్నతాధికారులను కోరారు.

## ఈనెల 21 నుండి పల్లికోనలో టైక్వాండో పోటీలు ప్రారంభం



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్ : భట్టిప్రోలు మండలంలోని పల్లి కోన గ్రామంలో ఆత్మకూరు టైక్వాండో అసోసియేషన్ గుంటూరు వారి ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ బాల బాలికల కు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిం చనున్నట్లు ఆర్గనైజర్ ఆళ్ళమూడి డేవిడ్ శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లికోనలోని పరుచూరి రఘుబాబు, సుబ్బరామిరెడ్డి లలిత కళా పరిషత్ ప్రాంగణంలో ఆదివారం నుండి ప్రారంభమవు తాయని తెలిపారు.ఆటల పోటీలను ఉదయం ఏడు గంటలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్, క్రీడాభిమానులు ప్రారంభిస్తారని డేవిడ్ తెలిపారు. జిల్లాలోని క్రీడా అభిమానులు ఈపోటీలను వీక్షించి సహకరించాలని ఆయన కోరారు.

## మీడియాపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు సిగ్గు చేటు : మిరియం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : మీడియా మిత్రులపై ఎంపీ విజయసాయిరెడ్డి అసభ్య పదజాలంతో మాట్లాడటం దారుణమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసు ఒక ప్రకటనలో ఖండించారు మీడియా మిత్రులను వాడు వీడు అనే పదాలతో విలేకరుల సమావేశంలోనే మాట్లాడటం ఎంతవరకు సబబుని ప్రశ్నించారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజం లేదు అని నిరూపించుకోవాల్సిన బాధ్యత తన మీద ఉంటే దానిని పక్కనపెట్టి మీడియా మిత్రులపై చిందులు వేయటం ఏమిటని ప్రశ్నించారు. మీడియా మిత్రులు వారికి తెలిసిన విషయాలను పబ్లిక్‌గా ప్రశ్నించటం వారి బాధ్యత అని ఎంపీ విజయసాయి రెడ్డికి తెలియదా...? అని ప్రశ్నించారు. ఎంపీ వెంటనే మీడియా మిత్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఎంపీటీసీలు




కర్లపాలెం, మేజర్‌న్యూస్: గత పాలకులు తమ సెగ్మెంట్‌లోని అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకుండా ఆటంక పరిచరాని ఎంపీటీసీలు సర్వ సభ్య సమావేశంను బాయ్ కాట్ చేశారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ యరం వనజ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ కర్లపాలెం మండల కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందన్నారు. ఎంపీటీసీలకు తెలియకుండా అధికారులు కోట్ల రూపాయలు బిల్లులు పెట్టుకొని అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేశారు.క్యాష్ పుస్తకాలు మాకు చూపించాలని అధికారులను డిమాండ్ చేశారు. కర్లపాలెం జగనన్న కాలనీలో పేదలకు అందచేసే ప్లాట్లలో చెరువులోని బురదను మెరకగా వేసి కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్మును మాజీ ఎమ్మెల్యే తన అనుచరులకు లబ్ది చేకూర్చారని మండి పడ్డారు. జగనన్నకాలనీకి తీసుకున్న స్థలాన్ని మంచి నీటి చెరువగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పిన గత పాలకుడు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వడమే కాకుండా బిల్లుల రూపంలో తన అనుచరులకు ప్రభుత్వ ఖజానాన్నే దోచిపెట్టారని గత పాలకులను దుయబట్టారు. జగనన్న కాలని అని చెప్పే ప్రభుత్వ స్థలాన్ని పూడ్చడానికి అంతకు ముందు మంచి నీటి చెరువు కోసం అని తీసుకున్న ప్రభుత్వం స్తలంలో మట్టి తవ్వకొని అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు కుచ్చుటోపీ పెట్టారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని పూడ్చడానికి ప్రభుత్వ స్థలాన్నే తవ్వి కోట్లు రూపాయలు బిల్లులు చేసుకున్న వైనం పై ఎంక్వైరీ వేసి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని త్రవ్వుకుంటుంటే చోద్యం చూస్తూ వూరు కున్న అదికారుల మీద చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్లపాలెం మండలం పెదగోళ్ళపాలెం సచివాలయంలో పెదలైన దర్జీలకు ఇచ్చే సొమ్మును లక్షల్లో కాజేస్తే ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియ జేస్తే, మండలంలో అలాంటి దోపిడీ అవినీతి మళ్ళీ తిరిగి జరగకుండా ఉండటానికి ఆస్కారం ఉంటుందని కోరారు. ప్రజల దాహార్తి తీర్చటానికి గతంలో ఎంపీటీసీలు చేతి పంపులకు నిధులు ఇవ్వండి మహాప్రభో మొర పెట్టుకుంటే నిధులు లేవని గత పాలకులు, అధికారులు సమాధానం చెప్పారని అధికారులపై మండి పడ్డారు. కర్లపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల సొమ్ముతో ఏసీ లు అమర్చుకుని విలాసవంతంగా తీర్చిదిద్దుకోవడానికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయని అధికారులను ప్రశ్నించారు. ఎంపీటీసీలుగా ఎన్నుకున్న ప్రజలకు శిరస్సు వంచి క్షమాపణలు కోరుకుంటునమ్మన్నారు.ఈ మూడు సంవత్సరాల నుండి ఎంపీటీసీల ప్రమేయం లేకుండా వాడుకున్న మండల పరిషత్ నిధులకు లెక్కలు చెప్పే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రస్తుత ఎంఎల్‌ఏ వేగేశన నరేంద్ర వర్మరాజు కు విజ్ఞప్తి చేశారు.

అవినీతి రహిత బాపట్లగా చేస్తాను అని శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అనటం ప్రజలు అందరూ స్వాగతించదగిన విషయని ఎంపీటీసీ తాంద్రతో పాటు సమావేశాన్ని బై కాట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దొంతి బోయిన లక్ష్మి సాంబ్రాజ్యం, ఆసిఫ్ అలీ, రాతంశెట్టి లక్ష్మణ్, చీరాల పద్మావతి, పులుగు సుబ్బా రెడ్డి, గొర్ల కమల, హైమావతి, దిండు నాగ లక్ష్మిలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నిజాంపట్నం,మేజర్‌న్యూస్: నిజాంపట్నం బాలుర గురుకుల పాఠశాలలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎన్. శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్ళలో విద్యార్థుల సమస్యలు అధ్యయనంలో భాగంగా ఎస్ఎఫ్ఐ బృందం సర్వే నిర్వహించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ఆయా హాస్టళ్ళలో కల్పిస్తున్న పలు మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేశామని, ఈ సందర్భంగా మండల కేంద్రమైన నిజాంపట్నం గురుకుల పాఠశాలలో మంచినీటి ఆర్వో ప్లాంట్ రిపేరు కారణంగా బయటి నుంచి మంచినీరు కొనుగోలుకు అధిక మొత్తంలో వ్యయమౌతున్నట్లు గుర్తించామన్నారు. 2006లో నిర్మాణం చేసిన ఈ భవనంలో వంటశాల,





మరుగుదొడ్లు అక్కడక్కడ భవనంలో పెచ్చులూడుతున్నందున రిపేర్లుచేయాలన్నారు. నూతన వంటపాత్రలు సమకూర్చాలన్నారు. ఆయా హాస్టళ్ళను అధికారులు తనిఖీచేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, వాతావరణ మార్పుతో అనారోగ్యం పాలవుతున్నందున మెడికల్ చెకప్ తక్షణమే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నిజాంపట్నం మండల అధ్యక్షుడు బి. ప్రేమ్‌చంద్, టి. దేవకినంద్, ఎన్. హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### 22న నిరసన కార్యక్రమాలకు వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

ఒంగోలు, మేజర్‌న్యూస్ : గత రెండు నెలలకు పైగా ఉపాధి హామీ కూలీలు చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. బకాయిల విడుదల కోసం ఈ నెల 22న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని, ఈనెల 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో ఉపాధికి నిధులు పెంచాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం జిల్లా సీనియర్ నాయకులు జాల అంజయ్య, జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చిందని గుర్తు చేశారు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిత్యం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్నదని దాన్ని



కాపాడుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. ఈనెల 23వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీకి తగిన విధంగా నిధులు కేటాయించకపోతే పేదలను కదిలించి ఉద్యమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ నెల 22వ తేదీన బకాయిల విడుదల కోసం, ఉపాధి హామీ పనులు చూపాలని, బడ్జెట్లో నిధులు పెంచాలని జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు విరివిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.